
ప్రజాశక్తి

గురువారం 11 జులై 2024



నేడు మార్కెట్ ఆశీలు, షాపుల వేలం పాట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారీ మార్కెట్, మున్సిపల్ పరిధిలో గల పలు ఏరియాల్లో రోడ్డు మార్జిన్ అశీలు వసూళ్లు చేసుకునేందుకు వేలం పాటను గురువారం నిర్వహిస్తున్నట్టు కమిసనర్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే మున్సిపల్ అధీనంలో ఉన్న మున్సిపల్ వాణిజ్యభవన సముదాయంలో ఉన్న 22, 32,35, 44, 46 నెంబర్ల షాప్‌లను అద్దె ప్రాతిపదికన వేలంపాట ఉంటుందన్నారు. మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారుల పర్యవేక్షణలో జరిగే ఈ మార్కెట్ అశీలు వేలంపాటలో పాల్గొనేవారు రూ.5 లక్షలు సాల్విన్ సర్టిఫికేట్‌తో పాటు రూ.4 లక్షల దరావత్తు మున్సిపల్ రెవెన్యూ అధికారులకు అందజేసి వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పలుచోట్ల సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన బిఎన్ఎస్ క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. దేశవ్యాప్తంగా కార్మిక కోర్కెలు దినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు, స్కీం వర్కర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్యని అన్నారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటీకరించడం కేంద్రప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని తెలిపారు. రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, విద్యుత్, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్, ఆప్కాస్‌లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు, మధ్యాహ్న భోజనం, సమగ్ర శిక్ష , విద్య, వైద్య 104, 108, రంగంలో పనిచేసే వారందరికీ జీతాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.జ్యోతి, శాంతి, తులసి, శివాని, గౌరీశ్వరి, గౌరి, అలివేలు మంగ, కృష్ణ, పాకల సన్యాసిరావు తదితర కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ : కార్మిక వ్యతిరేక చట్టాలు అమలు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిని అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల సమన్వయ కమిటీ అధ్యక్షులు బి.అమరవేణి, కార్యదర్శి కాదా రాము నిరసననుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎన్.హిమప్రభ, జి.జెస్సీ బాయ్, కె.గౌరీశ్వరి, మహేశ్వరి, ధనలక్ష్మి, జి.శారద, కె.శారద, లలిత, ధనలక్ష్మి, కుమారి, గతదితరులు పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ కార్మికులు, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఎస్ డిటి రంగారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శశికళ, నారాయణమ్మ, పుష్ప, మరియమ్మ, సుజాత, టి.రాముడు, టి.శంకరరావు పాల్గొన్నారు.

బలిజిపేట : దేశవ్యాప్తంగా కార్మికుల కోర్కెలు దినం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, నాయకులు భానుమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

కురుపాం :తొలుత స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపి తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళకుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా, నాయకులు జె.సరోజ, రాధాకుమారి, సూర్యకుమారి, శోభారాణి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ రమేష్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు అనురాధ, జ్యోతి పద్మ, పార్వతి, లక్ష్మి, రత్నకుమారి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు బి.పార్వతి, ఎ.దరిశమి, ఎస్.ఆదమ్మ, టి.రమాదేవి, ప్రమీల, జి.గౌరి, ఎ.అరుణ, ఎ.శాంత కుమారి, టి.సత్యవతి, పి.రత్నాలు, బి.కమల, ఎన్.శ్రీదేవి, ఎన్.రోయిబా, చామంతి, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శు వి.రామలక్ష్మి, జి.వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి వై. శాంతి కుమారి, గ్రీన్ అంబాసిడర్ల నాయకులు జలుమూరు గౌరు, మరడ సత్యవతి, పుణ్యవతి, తదితర కార్మికులుపాల్గొన్నారు.

మక్కువ :స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.కృష్ణ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, సుశీల, పార్వతి, అలేఖ్య రేవతి, కాంచన, జ్యోతి, విఆర్ఎల కమిటీ సభ్యులు రాజారావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరంవినతి పత్రాన్ని స్థానిక తహశీల్దార్ ఎ.జయకు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు సిహెచ్ గౌరమ్మ, కృష్ణవేణి, సత్యవతి, హైమావతి, స్వాతి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాభవానీ, పద్మ, గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు సామంతుల అప్పారావు, పుచ్చల గోపాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

గుమ్మలక్ష్మీపురం :స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, ఎం.సన్యాసిరావు, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : కార్మికుల కోర్కెల దినోత్సం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కరాత్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు తమ తహశీల్దార్ సీతారామయ్యకు వినతిని అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళకుమారి, జి.సుభద్ర, గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : కార్మికుల కోర్కెల దినం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీ బొమ్మ నుంచి శ్రామిక మహిళా నాయకులు కె.పార్వతీదేవి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింతపోలిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పి.రమేష్, ఎ.శ్రీనివాసరావు, నారాయణరావు, సిహెచ్ రామలక్ష్మి, రమణమ్మ, జి.కుమారి, కె.రాములమ్మ, బుర్ర లక్ష్మి, తెరీజమ్మ, రమాదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎన్ సింహాచలం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం డిటి కుమార్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిటి శేఖరానికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు కన్యాకుమారి, జ్యోతి, పద్మ పాల్గొన్నారు.







బలిజిపేట, సాలూరు, సీతానగరం తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన, పథకం, మున్సిపల్ తదితర కార్మికులు, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య కార్డులు

విస్తృతంగా జీవనోపాధి కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యార్థుల సమగ్ర ఆరోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆరోగ్య పరిరక్షణ నిరంతర పర్యవేక్షణకు సమగ్ర ఆరోగ్య కార్డులు (ఇంటిగ్రేటెడ్ హెల్త్ కార్డులు) జారీ చేసేందుకు సిద్ధం చేయాలని అన్నారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జిసిసి తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఆయన చెప్పారు. కుటీర పరిశ్రమలు పెద్ద ఎత్తున జరగాలని ఆయన అన్నారు. అనాస ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టే అవకాశాలు ఉందని అటువంటి వాటికి ప్రయత్నించాలని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో రక్త హీనత వంటి అంశాలపై దృష్టి సారించడం మాత్రమే కాకుండా పర్యవేక్షణ ఉండాలని అన్నారు.

విద్యార్థులకు మెనూ విధిగా పాటించాలి

మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు కావాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూలో ఎటువంటి తేడా ఉండరాదన్నారు. పాఠశాల ప్రాంగణంలో పౌష్టికాహార విలువలు గల కూరగాయలను విద్యార్థులతో నిర్వహించాలని తద్వారా పౌష్టిక ఆహారం విలువ చిన్నప్పటి నుంచి తెలుస్తుందనిసూచించారు. వసతి గృహాల్లోకి దోమలు రాకుండా మెస్‌లు విధిగా ఉండాలని, శుభ్రమైన తాగు నీరు ఉండాలని, ఆర్ఒ ప్లాంట్లు ఉంటే అవి పనిచేస్తూ ఉండాలని, ఫ్యాన్ - లైట్ విధిగా పని చేస్తూ ఉండాలని, మరుగుదొడ్ల వద్ద నిరంతర నీటి సరఫరా ఉండాలని, విద్యుత్ దీపాలు ఉండాలనిస్పష్టం చేశారు. పాఠ్య పుస్తకాలు, కిట్లు, యూనిఫారాలు ప్రతి విద్యార్థికి అందాలని అన్నారు. ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థుల అభ్యసన స్థాయి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థులతో పత్రికలు చదివించాలని తద్వారా వేదిక మీద భయం లేకుండా మాట్లాడే శక్తి వస్తుందని చెప్పారు. లఘు నాటికలు వంటి వాటిని విద్యార్థులతో చేయించడం వల్ల మాట్లాడే శక్తి వస్తుందని, భాషపై పట్టు పెరుగుతుందని సూచించారు. నా బడి - నాకు గర్వకారణం (మై స్కూల్ మై ప్రైడ్) కార్యక్రమం పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పఠనాసక్తి మెరుగుపర్చాలన్నారు. జిల్లా స్థాయిలో మంచి సైన్స్ ఫెయిర్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను క్రీడల్లో సైతం ప్రోత్సహించాలన్నారు. మంచి కెరీర్ గైడెన్స్ కల్పించాలని, ఉన్నత చదువులు, ఉద్యోగాల పట్ల విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ నేతృత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఆర్ఒఎఫ్ ఆర్ పట్టాలను అర్హులైన అందరికీ దాదాపుగా అందించామన్నారు. సమావేశంలో సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ ఎపిఒలు జి.చినబాబు, ఎ.మురళీధర్, ఎఎఒ ప్రసాద్, జిసిసి డిఎం వి.మహేంద్ర కుమార్, డిఇఒ జి.పగడాలమ్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి పర్యటన సందర్భంగా ఆయన మండలంలోని లంబూరులో జల్ జీవన్ మిషన్ పనులను, ఎం.సింగుపురంలోని ప్రాథమిక పాఠశాలను, ఆసుపత్రిని పరిశీలించారు. ఎం.సింగుపురం పంచాయతీ మల్లివీడులో పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటికీ తాగునీరందించేందుకు జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనేక అంటువ్యాధుల నుంచి ప్రజలను దూరంగా ఉంచేలా సురక్షితమైన మంచినీరందించడమే లక్ష్యంగా ఉండాలని ఆయన చెప్పారు. అనారోగ్య కారణాల వల్ల చాలా కుటుంబాలకు అనవసర ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగించాలని ఆదేశించారు. డయేరియా, నీరు, క్రిముల ద్వారా సంక్రమించే వ్యాధులు సంభవించకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పారిశుధ్య కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వర్షాకాలంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. తరగతులు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, అత్యంత నిబద్ధతతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చక్కగా చదువు కోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆవరణలో ఉన్న ఫీడర్ అంబులెన్స్‌ను పరిశీలించారు. అంబులెన్స్ వినియోగాన్ని సిబ్బంది వివరించారు. లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, తహశీల్దారు వరహాలు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ ఢిల్లీశ్వరరావు, ఎఇ ప్రవల్లిక, తదితరులు ఉన్నారు.



జలజీవన్ మిషన్ పైపులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అభివృద్ధి చేస్తూ సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

మండలాన్ని ఒకవైపు అభివృద్ధి చేస్తూనే మరోవైపు సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధి, సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలోనిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని 19 శాఖల అధికారులు పనుల నివేదిక శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. ముందుగా రెవెన్యూ శాఖలో ఇప్పటివరకు ఉన్న భూములు రీసర్వే ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు ఎన్ని ఇచ్చారో తహశీల్దార్ రమేష్ వివరించారు. ఐటిడిఎ ఇంజనీరింగ్ అధికారులు మండలంలో 49 రహదారులు 102 కిలోమీటర్ల మేర మంజూరయ్యాయని తెలిపారు. ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాలకు మంజూరైన రహదారులను ఫారెస్ట్ అధికారులు అనుమతుల్లేవని అడ్డుకోవడంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. గతంలో ఉన్న రోడ్డు పనులు మళ్లీ చేస్తే అనుమతుల్లేవని ఎలా చెప్తారని అధికారులను నిలదీశారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో అధికారులు పనిచేయాలని సూచించారు. అనంతరం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల నివేదికలో పూర్ణపాడు లాబేషు వంతెన పనులకు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా మరో రూ.3కోట్లు అదనంగా మంజూరు చేస్తే పది నెలల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. తక్షణమే ఈ విషయంపై ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టి నిధులు మంజూరు చేస్తామని వర్షాలు తగ్గిన వెంటనే వంతెన పనులు పూర్తి చేసేలా కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌అండ్‌బి అధికారులు అధ్వానంగా ఉన్న రోడ్లను పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో డిఇలు మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల రహదారి మరమ్మతుల కోసం నిధులు మంజూరు కాలేదని ప్రస్తుతం పనులు చేసేందుకు అవకాశం లేదని చెప్పడంతో ఒక్కసారిగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చొరవతో మంత్రి సంధ్యారాణికి రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. త్వరలో కోటి రూపాయల వరకు మంజూరు చేసేందుకు అవకాశాలున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలికంగా గోతులు కప్పి ప్రమాదాలు నివారించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం 19 శాఖల వారీగా సమీక్ష చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు సలహాలు చేసి సమస్యలను పరిష్కరిస్తూనే మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత మీదేనన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, పంచాయతీరాజ్ డిఇ రత్నకుమార్, వివిధ శాఖ అధికా రులు, టిడిపి, జనసేన నాయకులు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రానున్న మూడు నెలలు కీలకం

ప్రజాశక్తి - పార్వతీపురం

వైద్య ఆరోగ్య శాఖ రానున్న మూడు నెలలు కీలకంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య పరిస్థితులపై ఆ శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన బుధవారం సమీక్షించారు. వర్షాలు ప్రారంభమవుతున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిఫరల్ కాకుండా స్థానికంగానే మంచి వైద్యం అందించాలని ఆయన చెప్పారు. జ్వరాలకు, వ్యాధులకు విధిగా నిర్దేశిత కాలం మాత్రలు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలని, ఆశాలు ఇంటి వద్ద పరిశీలించాలని అన్నారు. సమన్వయంతో పనిచేయాలని, వైద్యానికి వచ్చినప్పటి నుండి కోర్సు పూర్తి చేసే వరకు వైద్యాధికారి నుంచి ఆశా వరకు సమన్వయం ఉండాలన్నారు. ఆసుపత్రుల వారీగా మలేరియా చికిత్స పొందిన కేసులు, వారు మందులు వాడుతున్న తీరుపై నివేదిక సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి జగన్మోహనరావు మాట్లాడుతూ మలేరియా నివారణకు చేపట్టిన చర్యలను వివరించారు. మలేరియా ప్రభావిత ప్రాంతాలలో స్ప్రేయింగ్ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్, డిఐఒ నారాయణ రావు, ప్రోగ్రామ్ అధికారి ఎం వినోద్, ఎపి ఎం ఎస్ ఐ డి సి ఇఇ సూర్య ప్రభాకర రావు, సి హెచ్ సి పర్యవేక్షకులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



వంశధార నదిలో నాటుపడవపై ప్రయాణిస్తున్న గిరిజనులు

మొదలైన నాటు పడవ ప్రయాణం

పజాశక్తి - భామిని

ఇటీవల కురిసిన వర్షాలకు వంశధార నదిలో నీటి మట్టం పెరగడంతో నేరడి మీదుగా వంశధార నదిని కాలినడకన దాటి ఒడిశాలోని కండవ, కండవ రైల్వే స్టేషన్ వెళ్లే ప్రయాణికులు నాటు పడవను అశ్రయించారు. సాధారణంగా భామిని మండలి ప్రజలు తక్కువ వ్యయంతో త్వరగా ఒడిశా లోని కండవ, కాసినగర్ రైలు మీద గుణుపూర్, టెక్కలి, పలాస, పర్లాఖిముండి, వంశధార నది దాటి వెళ్తుంటారు. ప్రస్తుతం నదిలో నీటి మట్టం పెరగటం తో నాటు పడవ ప్రయాణం తప్పనిసరి అయ్యింది.

పేదలపై రెవెన్యూ కేసులు ఆపాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన నాడు ఏ విధమైన సబ్ డివిజన్ చేయకుండా నేడు ఇల్లు కట్టుకుంటున్న పేదలపై కేసులు పెట్టడం అన్యాయమని, వెంటనే కేసులు పెట్టకుండా ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. మండలంలోని తూరుమామిడిలో ఇళ్ల కట్టుకుంటున్న పేదలపై తప్పుడు కేసులు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ గ్రామంలో 1995, 2019లో పేదలు, వృత్తిదారులకు సర్వే నెంబర్ 71లో సబ్ డివిజన్ చేయకుండా పట్టాలు మంజూరు చేశారని అన్నారు. పట్టాలు ఇచ్చిన స్థలాల్లోనే హైస్కూల్ కట్టడం కోసం సుమారు ఎకరా భూమి కేటాయించారని అన్నారు. అప్పట్లో ఇళ్ల స్థలాలకు సబ్ డివిజన్ చేయక పట్టాదారులు ఎక్కడ కట్టాలో తెలియక ఎవరికి నచ్చిన దగ్గర వారు కట్టుకున్నారని అన్నారు. అందరిలాగే చీపురు మహాలక్ష్మి, బొద్దాన గంగ, బొడ్డాన పైడమ్మ, బొద్దాన లక్ష్మి, బొద్దాన సింహాచలం, బొద్దాన రాజేశ్వరి పూరిళ్లు కట్టుకున్నారన్నారు. వీటిని రేకిళుగ్గా కట్టుకోవడానికి ప్రయత్నిస్తే రెవెన్యూ అధికారులు పేదలపై తప్పుడు కేసులు పెడుతున్నారు ఇది అన్యాయమన్నారు. ఇప్పటికైనా పేదలపై తప్పుడు కేసులు ఆపాలని డిమాండ్ చేశారు.

ఆర్‌బికె ఎప్పుడు నిర్మిస్తారు?

మండలంలోని తూరుమామిడిలో సర్వే నెంబర్ 71/4లో 5 సెంట్లు భూమిని రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి కేటాయించారని, గతేడాది కాలంగా స్థలం వున్నప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు ఆర్‌బికెను నిర్మించలేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆర్‌బికె నిర్మించాలని, లేకుంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల అధ్యక్ష కార్యదర్శులు పిట్టల సీతారాం, అల్లు ఆదినారాయణ, సిపిఎం మండల నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని కల్లికోటలో కొత్తగా నిర్మించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ముందుగా గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యేను స్థానిక నాయకులు, గ్రామస్తులు కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఎమ్మెల్యే పర్యటిస్తూ ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి పూజలు నిర్వహించి ఆవిష్కరించి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగం ప్రపంచంలోని ఎక్కడా లేదన్నారు. రాజ్యాంగంలో ఉన్న హక్కులను ప్రతి భారత పౌరుడు వినియోగించుకునేలా చట్టాలు ఉన్నాయని తెలిపారు. కావున యువతి, యువకులు చట్టాలపై అవగాహన కల్పించుకుని అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఎన్.శేఖర్ పాత్రుడు, అరకు పార్లమెంటరీ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, సీనియర్ నాయకులు నంగిరెడ్డి మధుసూదనరావు, పొట్నూరు వెంకట నాయుడు, ఎంపిటిసిలు గంట వెంకటనాయుడు, అధికారి సంతోషి, స్థానిక జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పిఎఒ హరికృష్ణ బదిలీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అగ్రికల్చర్ అధికారి జి.హరికృష్ణకు బదిలీ అయ్యింది. వ్యవసాయ శాఖ నుంచి రెండేళ్లుగా సీతంపేట ఐటిడిఎకు పొరుగు సేవలు అందించారు. కాలపరిమితి పూర్తి కావడంతో ప్రస్తుతం పిఎఒ హరికృష్ణ సొంత శాఖ అయిన వ్యవసాయ శాఖకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయనకు ఇంకా పోస్టింగ్ చూపలేదు. ప్రస్తుతం పిఎఒ ఇన్చార్జిగా పిహెచ్ఒ గణేష్ బాధ్యతలు స్వీకరించారు.

ఎపిఒ బదిలీ

ఉపాధి హామీ చట్టంలో పనిచేసిన ఎపిఒ బాబూరావుకు గుమ్మలక్ష్మీపురం బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో ఇంకా ఎవర్నీ భర్తీ చేయలేదు.


ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బకాయి వేతనాలు చెల్లించాలని ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - సీతానగరం

10నెలల బకాయి వేతనాలు చెల్లించాలని ఎంపిడిఒకు గ్రీన అంబాసిడర్లు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో గల గ్రీన్ అంబాసిడర్లు గతంలో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా వేతనాలు చెల్లించే వారని, పంచాయతీలకు అప్పగించిన తర్వాత సక్రంగా జీతాలందక అనేక ఆర్థిక ఇబ్బందులకు, మానసిక క్షోభకు లోనయ్యామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నేరుగా చెల్లించాలని, తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నామన్నారు. ఈ నెలాఖరులోగా బకాయివేతనాలు చెల్లించాలని, లేకుంటే సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల నాయకులు జలుమూరు గౌరు, చీకటి శివున్నాయుడు, కందుకూరు రాము, బాత శంకరరావు, పెంకి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

స్థానిక భవిత కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి ఎ.నాగభూషణరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మానసిక, శారీరక దివ్యాంగులైన చిన్నారులకు ఈ కేంద్రంలో ఫిజియోథెరపీ చేయిస్తూ వారి శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు విద్యను అభ్యసించేలా సిబ్బంది చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి బుధవారం వైద్యాధికారి డాక్టర్ కె.ప్రశాంత్ కుమార్ చిన్నారులకు ఫిజియోథెరపీ చేయిస్తూ వారి బంగారు భవితకు తోడ్పడుతున్నారని అన్నారు. అలాగే సుమారు 20 మంది చిన్నారులు ఈ భవిత కేంద్రం ద్వారా మానసిక శారీరక చికిత్స పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐ ఆర్ టి రేష్మ, సురేష్‌తో పాటు సహాయకులు ఎల్.జానకి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఎసిఎం పిచికారీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 15 నుంచి మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల 37 గిరిజన గ్రామాల్లో రెండో విడత ఎసిఎం పిచికారీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు గుమ్మలక్ష్మీపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మలేరియా వ్యాప్తి గ్రామాల్లో ఎసిఎం పిచికారీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

శంభాంలో స్టాప్ డయేరియా

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో శంభాంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేశారు. జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సీజన్లో అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శి వినోద్ ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ వేడి ఆహారం, నీళ్ల తాగాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. జ్వరాలు వస్తే వైద్యులను, సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, కూటమి నాయకులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

జోగులడుమ్మ ఫీల్డ్ అసిస్టెంట్ పై దర్యాప్తు

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

మండలంలోని జోగులడుమ్మ గ్రామ ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు నాగమణి అవినీతికి పాల్పడిందన్న ఆరోపణలపై బుధవారం స్థానిక ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు , ఎపిఒ శ్రీనివాసరావు పంచాయతీ కార్యాలయంలో దర్యాప్తు నిర్వహించారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి కూలీల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేసిందని ఒక వర్గానికి చెందిన వారు ఆరోపించగా, గ్రూపులోని కొంతమంది సభ్యులు ఎంపిపి బొంగు సురేష్ ఆదేశాల మేరకు తనను తొలగించాలన్న కక్షతో ఆరోపణలు చేస్తున్నారని నాగమణి తెలుపగా వారి ఇరువురి నుంచి పూర్తి వివరాలను సేకరించారు. తుది నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.


విచారణ చేస్తున్న అధికారులు

స్ఫూర్తిదాయకం.. శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం

ప్రజాశక్తి - కురుపాం

శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటమే గిరిజన చైతన్యానికి ఊపిరిని ఇచ్చి స్ఫూర్తిదాయకమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, మాజీ సర్పంచ్ వెంపటాపు భారతి అన్నారు. మండలంలోని గుమ్మిలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం, కైలాసం వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం దున్నేవాడికే భూమి అన్న నినాదంతో భూస్వాములకు వ్యతిరేకంగా చేపట్టిన శ్రీకాకుళ రైతాంగ పోరాటమని అన్నారు. అక్షర జ్ఞానం లేని ఆదివాసులకు అంకెలు తెలియకపోవడంతో భూస్వాములకు దోపిడీకి వరంగా మారిందన్నారు. భూస్వాముల నుంచి గిరిజనులకు విముక్తి కల్పించడానికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఏర్పాటు చేసి పలుమార్లు ఉద్యమాలు చేపట్టారని అన్నారు. దీని ద్వారా వారు గిరిజనులకు స్ఫూర్తిదాయకమయ్యారన్నారు. అనేక పోరాటాలు సాగిస్తున్న నేపథ్యంలో 1971లో పోలీసుల తూటాలకు సత్యం, కైలాసం బలయ్యారని, వారి స్ఫూర్తిని తీసుకుని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పార్వతీపురం టౌన్ : శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధపోరాట యోధులైన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంల 54వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, పార్వతీపురం- బొబ్బిలి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కళాసీ సంఘం ఆఫీస్ లో సభ జరిగింది. ముందుగా ఆ అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఏరియా కమిటీ నాయకులు కామ్రేడ్ మెరగాని గోపాలం అధ్యక్షతన సభ ప్రారంభమైంది. ఎఐ.కె.ఎం.ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొత్స నరసింగరావు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు గేదెల సర్వేశ్వరరావు, ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి, పిల్లా లక్ష్మణరావు, జిల్లా కోశాధికారి కామ్రేడ్ జన్ని ముత్యాలు మరియు అఖిల భారత ఆదివాసీ వేదిక (ఏ.ఐ.టి.ఎఫ్) జాతీయ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ శంబుడు జయలక్ష్మి ప్రసంగించారు.


అంబేద్కర్ విగ్రహానికి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

'సహారా' ఖాతాదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కేంద్ర ప్రభుత్వం, సహారా ఇండియా యాజమాన్యంతో మోసపోయిన కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులు సమావేశంలో కట్టిన డబ్బు చెల్లించి వారిని ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో సహారా సీనియర్ వర్కర్ శ్రీనుబాబు అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాల సహారా సీనియర్ కార్యకర్త బిఎల్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వేణు, కృష్ణమూర్తి మాట్లాడుతూ 2009-10 మధ్యలో మొదలైన సహారా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్ప్ రేషన్ బాండ్లకు వ్యతిరేకంగా అక్రమ వసూలు చేశారంటూ సెబీ కేసు పెట్టిందన్నారు. ఈ కేసు విచారణలో సుప్రీం కోర్టు 2012లో 15శాతం వడ్డీతో సహా తిరిగి ఖాతాదారులకు ఇచ్చేయమని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కానీ సహారా ఇండియా యాజమాన్యం ఏజెంట్లకు, ఖాతాదారులకు అటు సుప్రీం కోర్టుకు ప్రభుత్వాలకు తెలియకుండా సహారా క్యూషాప్ బాండ్లుగా మార్చేసి డబ్బులు ఇచ్చేశామని సుప్రీం కోర్టులో పచ్చి అబద్ధాలు చెప్పిందన్నారు. 2018 లో క్యూషాప్ డబ్బులు ఇస్తామని చెప్పి మళ్ళీ వాటిని సహారా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ అని సహారా మల్టీ స్టేట్ కోపెరిటి వ్ సొసైటీ గా ఏజెంట్లకు, ప్రజలకు మాయ మాటలు చెప్పి నమ్మించిందన్నారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది అమాయక పేద, మధ్య తరగతి ప్రజలు ఏజెంట్ల నరక బాధలు తప్పించేలా పోర్టల్ నిబంధనలు తొలగించాలని, వీలైతే సహారా ఆఫీస్‌ల్లో బాండ్లు బుక్ లు అప్లై చేసుకుని కస్టమర్ల అకౌంట్‌లో సుప్రీంకోర్టు తెలిపిన ప్రకారం డబ్బులు చేరేలా మేలు చేయాలని కోరుతూ ఈనెల 15న కలెకరేట్ వద్ద ధర్నా చేనపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సహారా ఇండియా ఏజెంట్లు, ఖాతాదారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.


నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతంపేట

పెండింగ్ వేతనాలు విడుదల, సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంఆర్ సి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మె కాలం జీతం, సమ్మె ఒప్పందాలు అమలు, హెచ్ఆర్ పాలసీ అమలకు కమిటీ ఏర్పాటు, అన్నీ విభాగాలకు ఎంటిఎస్ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. నూతన డిఎస్‌సిలో వెయిటేజీ ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, గెస్ట్, డైలీ వైజ్ సిబ్బందిని వెంటనే రెన్యువల్ చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. కరవు భత్యం, ఇంటి అద్దె సౌకర్యం, గ్రాట్యుటీ కల్పించాలని, సామజిక భద్రత పథకాలు ఇపిఎఫ్, ఇఎస్ఐను అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే మినిమం ఆఫ్ టైం స్కేల్ ప్రకారం వేతనాలు పెంచాలని, పరస్పర, రిక్వెస్ట్ బదిలీలను వెంటనే చేపట్టాలని, సకాలంలో వేతనాలు విడుదల కాక ఉద్యోగులు చాలా ఆవేదన చెందుతున్నారన్నారు. పై సమస్యలు పరిష్కారం కోసం ఎంఇఒ కార్యాలయం వద్ద, క్లస్టర్ కాంప్లెక్స్, హై స్కూల్స్, కేజీబీవిల్లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలియ చేశామన్నారు. కార్యక్రమంలో నిమ్మక శ్రీనివాసరావు, హేమలత, నిరంజన్, ధవలేశ్వరరావు, మోహన్ రావు, రాములు, రాజ్‌కుమార్, కళ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల సాయికి మరో మూడు నవోదయ సీట్లు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పెదమేరంగి కూడలిలో గల తిరుమల సాయి హై స్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన జవహర్ నవోదయ పరీక్షల్లో 16 మంది నవోదయకు ఎంపికవ్వగా, మళ్లీ రెండో జాబితాలో మరో ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించినందుకు పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఇందులో దాసరి నితీష్, కళ్యాణ్, మోహన్ స్వరూప్ రెండవ జాబితాలో ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి, న్యాయ సలహాదారు రౌతు వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే విజయ్‌చంద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్/రూరల్

ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన అనంతరం బోనెల విజయచంద్ర పుట్టిన రోజు వేడుకలు బుధవారం మొదటిసారి పట్టణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య ఇండుపూరు వెంకట్రావు కల్యాణ వేదికలో ఘనంగా జరిగాయి. ముందుగా కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రక్తం ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువత ద్వారా 300 యూనిట్ల రక్తాన్ని వైద్య బృందం సేకరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేచే కల్యాణచే కేకు కట్ చేయించారు. నియోజకవర్గం పరిధిలో గల బలిజిపేట, సీతానగరం మండలాలతో పాటు పార్వతీపురం రూరల్, పట్టణ పరిధిలో గల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉన్నత అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేశారు. అలాగే నోట్ పుస్తకాలను, పెన్నులను అందించి తన అభిమానాన్ని చాటుకుని అభినందనలు తెలిపారు. బొబ్బిలి, కురుపాం ఎమ్మెల్యేలు బేబినాయన, తోయక జగదీశ్వరి విజయ్ చంద్రకు అభినందనలు తెలిపారు. అనంతరం టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్, ఆయన సోదరులు మజ్జి రాజా, మజ్జి కృష్ణమోహన్ విజయ్ చంద్రతో కేకు కట్ చేయించి, ప్రజాశక్తి దినపత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ బార్నాల సీతారాం, టిడిపి పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, తెలుగు యువత అధ్యక్షులు పాలకొండ రాజశేఖర్, టిడిపి కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరినాయుడు, తాతపూడి వెంకట్రావు, బిజెపి అధ్యక్షులు ద్వారపూడి శ్రీనివాసరావు, జనసేన నాయకులు చందక అనిల్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని నర్సిపురంలో జరిగిన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరి, వెంకటరమణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలను పంచారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు.


పేదలకు చీరలు పంపిణీచేస్తున్న టిడిపి నాయకులు బలరాంనాయుడు, చంద్రశేఖర్


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

వెంకంపేటలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు జాగాన భాస్కరరావు, రవికుమార్, ధనుంజయ చిన్నబొండపల్లి మాజీ సర్పంచి, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు గొరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి, చంటి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న గోతులను పూడ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మార్ నగరంలో సర్పంచి వంగపండు లక్ష్మి, ఉపసర్పంచి త్రినాధ నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. సంఘంవలసలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమరాపు రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు.

పలు సేవా కార్యక్రమాలు

సీతానగరం : పార్వతీపురం ఎమ్మెల్యే బోనుల విజయ్ చంద్ర పుట్టినరోజు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బూర్జ గ్రామంలో ఈదిబిల్లి బలరామ నాయుడు, అన్నపూర్ణమ్మ, నీరస చంద్రశేఖరు, జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు, పేదలకు దుప్పట్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు పెంట సత్యనారాయణ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమంలో చేయడం ఎంతో గర్వకారంగా ఉందన్నారు. అలాగే కాశీపేటలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తెంటు వెంకటప్పలనాయుడు, తేలు చంద్రశేఖరు, తేలు తిరుపతిరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

:మండల కేంద్రంలోని చాకలి వీధిలో ఎమ్మెల్యే విజయచంద్ర జన్మదినం సందర్భంగా ఎల్విఆర్ స్వచ్ఛద్ధ సంస్థ, పెదబోగిలి ఉపసర్పంచ్ కె అరవింద్ కుమార్, మానస సేవ సంస్థ ప్రతినిధి బాలు యాదవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాయితేజ, అప్పలకొండ, సింహాచలం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలుంటాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని నందివానివలసలో ప్రకృతి వ్యవసాయం చేసున్న మరడాన సరస్వతమ్మ, అప్పలనాయుడు, ప్రదీప్ తదితర రైతులు నవధాన్యాలు సాగును 'ఎ' గ్రేడ్ పంటల నమూనాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా సకల జీవరాశులకు, ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు, పలు లాభాలు లభిస్తాయన్నారు. తక్కువ పెట్టుబడి - ఎక్కువ దిగుబడులు నవధాన్యాలు 20 నుంచి 30 రకాలు వేసి 40 రోజుల్లోపు భూమిలో కలియ దున్నడం వల్ల భూమి సారవంతం చెందడంతో పాటు, రైతు మిత్రులైన వానపాములు, మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, వారి స్థితి గతుల మార్పు, పెట్టుబడులు తగ్గించడానికి ప్రయత్నాలు, రైతులు ఆచరించడం, భావితరాలకు మంచి శుభసూచకం అన్నారు. ఏ గ్రేడ్ పంటల నమూనాలో ఏడాది పొడువునా ఒక కుటుంబానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలు కలిగిన పంటలు లభిస్తాయని, ఇంటి అవసరాలు తీర్చుకోగా మిగిలిన పంట ఉత్పాదకాలు మార్కెట్ చేసుకోవడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో అన్ని గ్రామాల్లో ఏ గ్రేడ్ పంటల నమూనాలు వేయనున్నట్టు తెలిపారు. గ్రాడ్యూట్ ఫార్మర్స్‌ను ప్రకృతి వ్యవసాయం వల్ల ఆదాయ - వ్యయాలు, దిగుబడులు గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, అప్పలనాయుడు, రైతులు ప్రదీప్, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, గ్రాడ్యుట్ ఫార్మర్స్, తదితరులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ధరల నియంత్రణకు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పెరిగిపోతున్న నిత్యవసర సరుకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు విక్రయాలు జరుపుతున్నట్లు జాయింట్ కలెక్టర్ శోభిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పార్వతీపురంలో 4, సాలూరు మున్సిపాలిటీ పరిధిలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేసి కందిపప్పు కిలో రూ.160కు, బియ్యం సోనా మసూరి కిలో రూ.49 చొప్పున విక్రయిస్తున్నట్టు తెలిపారు. కావున జిల్లాలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రకటనలో కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయల కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యాలయాలకు పరిమితం కాకుండా తరచుగా గ్రామాల్లోని వీధులను సందర్శించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాల కారణంగా బావుల్లో కొత్తనీరు చేరే అవకాశం ఉందని, క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఎక్కడైనా జ్వరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ పి.రాము, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రబ్బర్‌డ్యామ్‌లో జారిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామ్‌లో ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం మరికి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన కద్రక గోపాలరావు(25) బుధవారం ఉదయం స్నానానికి జంఝావతి రబ్బరు డ్యాంకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు జారిపడిన మృతి చెందారు. ఈ విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.


మృతి చెందిన గోపాలరావు

13న షాపులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోనే 18 షాపులకు సంబంధించి ఈనెల 13న బహిరంగ వేలంపాట వేయనున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ పి.రాము బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 20న షాపులకు వేలంపాట వేయాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వాయిదా వేస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలంపాట వేయనున్నట్లు తెలిపారు. గుత్తేదారులు మూడు నెలలకు సంబంధించి 20 శాతం షాపులకు పైకం చెల్లించాల్సి ఉందన్నారు. 20శాతంతో పాటు షాపులకు సంబంధించి ఏ విధంగా పెండింగ్ లేని వారు బహిరంగ వేలం పాటుకు అర్హులని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశాన్ని గుత్తేదారులు గమనించాలని ఆయన కోరారు.

వీరఘట్టంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామంలోని నాలుగో సచివాలయం పరిధిలోని బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శాంత కుమారి, ఏఎన్ఎం ఉష, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

14 వరకు పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించనున్నట్టు మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పశు గ్రాస వారోత్సవాలు సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే పాడి రైతులు పశువు లకు పశుగ్రాసం వేయడం వల్ల అధిక పాలదిగుబడులు పొందవచ్చన్నారు. ఈ మేరకు రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పశుగ్రాసం విత్తనాలు 75 శాతం రాయితీపై అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి పాడి రైతు తమకున్న పొలంలో కొంతమేర కేటాయించి పశుగ్రాసం పెంపకం చేపట్టాలని కోరారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాల్టీ పరిధిలో ఉన్న 15 సచివాలయాలను మూడు యూనిట్లుగా విడదీసి 30 వార్డుల్లో ప్రతిరోజు మధ్యాహ్నం మూడు సచివాలయాలకు సంబంధించిన వార్డుల్లో పారిశుధ్య కార్మికులతో గ్యాంగ్ వర్క్ ను మొదలుపెట్టి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం కమిషనర్ ఆధ్వర్యంలో 1, 2, 20, 21, 29, 30 వార్డుల్లో ప్రయోగాత్మకంగా గ్యాంగ్ వర్క్‌ను మొదలుపెట్టారు. పారిశుధ్య కార్మికులతో కార్ గ్యాంగ్ వర్కులు, పారిశుధ్య నిర్వహణ పనులు, కాలువల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్, వార్డులో పేరుకుపోయిన చెత్తలను, వ్యర్థాలను తొలగించడం వంటి పనులను చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ సిహెచ్. మురళి, శానిటేషన్, ఎమినిటి, ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అన్ని విధాలా ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలోని మత్స్యకార సంఘాలన్నిటినీ బలోపేతం చేసి ప్రభుత్వ నుంచి అందాల్సిన రాయితీలన్నీ అందిస్తామని జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య అన్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా బుధవారం పార్వతీపురం ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో జిల్లాలోని మత్స్యకార సంఘ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపల పెంపకంలో మెలుకువలను వివరిస్తూ ప్రభుత్వం తరఫున చేపల పెంపకం దారుల సంఘాలకు లభిస్తున్న సబ్సిడీలు, బ్యాంకు రుణాల గురించి వివరించారు.